# కరెంట్ అఫైర్స్

## 'ఇఫీ' ఉత్తమ చిత్రం 'డాన్ బాస్'

★ 49వ అంతర్జాతీయ భారత చలన చిత్రోత్సవం (ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఇండియా - ఐఎఫ్ఎఫ్ఐ)ను 2018, నవంబరు 20 నుంచి 28 వరకు 'స్ప్రెడ్ ద జాయ్ ఆఫ్ సినిమా' అనే థీమ్‌తో గోవాలో నిర్వహించారు. 68 దేశాలకు చెందిన 212 సినిమాలను 'ఇఫీ'లో ప్రదర్శించారు.

★ ఉక్రెయిన్ సినిమా 'డాన్ బాస్' ఉత్తమ చిత్రంగా గోల్డెన్ పీకాక్ పురస్కారం గెలుచుకుంది. సెర్గీ లోజ్‌నిత్సా ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు. 'ఈ మా యోవ్' అనే మలయాళ చిత్రంలో నటనకు చెంబన్ వినోద్ ఉత్తమ నటుడిగా, 'వెన్ ద ట్రీస్ ఫాల్' అనే ఉక్రెయిన్ సినిమాలో నటనకు అనస్తాసియా పుస్తోవిత్ ఉత్తమ నటిగా, 'ఈ మా యోవ్'కు దర్శకత్వం వహించిన లిజో జోస్ పెల్లిస్సరీ ఉత్తమ దర్శకుడిగా 'సిల్వర్ పీకాక్' పురస్కారాలను గెలుచుకున్నారు.

★ లడఖ్ చిత్రం 'వాకింగ్ విత్ ది విండ్'కు యునెస్కో గాంధీ అవార్డు లభించింది. ప్రవీణ్ మోర్చాలే ఈ చిత్రానికి దర్శకత్వం వహించాడు.

★ ప్రముఖ బాలీవుడ్ స్క్రిప్ట్ రచయిత సలీమ్‌ఖాన్‌ను ఇఫీ ప్రత్యేక అవార్డుతో గౌరవించింది. ఆయన తరపున తనయుడు అర్బాజ్ ఖాన్ పురస్కారాన్ని స్వీకరించారు.

## పీఎస్ఎల్‌వీ-సీ43 ప్రయోగం

★ 2018, నవంబరు 29న భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) చేపట్టిన పీఎస్ఎల్‌వీ-సీ43 ప్రయోగం విజయవంతమైంది. రోదసిలో 2 గంటలపాటు అద్భుత విన్యాసాలు చేయించి శాస్త్రవేత్తలు అందరినీ ఆశ్చర్యపరిచారు. ఒకేసారి 31 ఉపగ్రహాలను తీసుకెళ్లి రెండు కక్ష్యల్లోకి విడిచిపెట్టడం ప్రయోగం ప్రత్యేకత.

★ శ్రీహరికోటలోని సతీష్‌ధావన్ అంతరిక్ష ప్రయోగ కేంద్రం (షార్) ఇందుకు వేదికైంది. షార్‌లోని మొదటి ప్రయోగ వేదిక నుంచి పీఎస్ఎల్‌వీ- సీ43 బయలుదేరాక 17.27 నిమిషాలకు మన దేశానికి చెందిన 380 కిలోల బరువున్న హైసిస్ (హైపర్ స్పెక్ట్రల్ ఇమేజింగ్ శాటిలైట్) అనే అత్యాధునిక భూపర్యవేక్షక ఉపగ్రహాన్ని 636.3 కిలోమీటర్ల ఎత్తులో నిర్ణీత కక్ష్యలో వదిలిపెట్టింది. తర్వాత రాకెట్‌లోని పీఎస్4 ఇంజిన్‌ను మరోసారి మండించి విదేశాలకు చెందిన ఒక మైక్రో, 29 నానో ఉపగ్రహాలను 504 కిలోమీటర్ల ఎత్తులో ఒక్కొక్కటిగా కక్ష్యలో విడిచిపెట్టింది. మన ఉపగ్రహం వదిలిపెట్టాక మిగిలినవి కక్ష్యలో చేర్చడానికి 95 నిమిషాల సమయం పట్టింది. మొత్తంగా 112 నిమిషాల సమయం తీసుకుంది. ఇస్రో చరిత్రలో అత్యంత సుదీర్ఘ సమయం సాగిన ప్రయోగం ఇదే.

★ 30 విదేశీ ఉపగ్రహాల మొత్తం బరువు 261.5 కిలోలు. 30 ఉపగ్రహాల్లో అమెరికాకు చెందినవి 23, ఆస్ట్రేలియా, కెనడా, కొలంబియా, ఫిన్‌లాండ్, మలేషియా, నెదర్లాండ్స్, స్పెయిన్‌లకు చెందినవి ఒక్కొక్కటి ఉన్నాయి. పీఎస్ఎల్‌వీ-సీ43 ద్వారా కొత్తగా నాలుగు దేశాలవారు తమ ఉపగ్రహాలను కక్ష్యలోకి పంపారు. కొలంబియాకు చెందిన ఎఫ్ఏసీ శాట్, మలేషియా ఇన్నోశాట్-2, స్పెయిన్ త్రీక్యాట్-1, ఆస్ట్రేలియాకు చెందిన సెంచరీ ఉపగ్రహాలను నిర్ణీత కక్ష్యలో ప్రవేశపెట్టారు.

★ మన దేశ హైసిస్ ఉపగ్రహం బరువు 380 కిలోలు. అందుకే దీన్ని 'ఛోటా భీమ్'గా పేర్కొంటున్నారు. భూ పరిశీలన కోసం ఆధునిక టెక్నాలజీతో దీన్ని రూపొందించారు.

వ్యవసాయం, అటవీ, భూగర్భ జలాల సమాచారాన్ని చాలా పక్కాగా తెలియజేయడం ఈ ఉపగ్రహం ప్రత్యేకత. అంతేకాకుండా మనదేశ రక్షణ రంగానికి కూడా విస్తృత సేవలు అందజేయనుంది. 2023 వరకు అయిదేళ్లపాటు ఇది సేవలు అందించనుంది.

## వృద్ధి రేట్లకు కోత

కాంగ్రెస్ నేతృత్వంలోని అప్పటి యూపీఏ ప్రభుత్వ హయాంలో నమోదైన కొన్ని సంవత్సరాల వృద్ధి అంచనాలను 2018, నవంబరు 28న కేంద్ర గణాంక కార్యాలయం (సీఎస్ఓ), నీతి ఆయోగ్‌లు సవరించాయి.

★ 2011-12 ఆధార సంవత్సరాన్ని పరిగణనలోకి తీసుకుని సీఎస్ఓపై అంచనాలను లెక్కగట్టింది. అంతకుముందు వేసిన అంచనాలను 2004-05 ఆధార సంవత్సరాన్ని పరిగణనలోకి తీసుకుని లెక్కించారు. 2015 జనవరిలో స్థూల ఆర్థిక గణాంకాల లెక్కింపునకు 2011-12 ఆధార సంవత్సరానికి మారారు.

## 'కర్తార్‌పూర్'కు శంకుస్థాపన

★ పాకిస్థాన్‌లోని కర్తార్‌పూర్ గురుద్వారాకు భారత సరిహద్దుల్లోని డేరాబాబానానక్ నుంచి నాలుగు వరుసల నడవా నిర్మాణానికి 2018, నవంబరు 26న ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడు శంకుస్థాపన చేశారు.

★ సిక్కు మత స్థాపకుడు గురునానక్ 550వ జయంతి సందర్భంగా (2019లో) కర్తార్‌పూర్ కారిడార్ నిర్మాణానికి కేంద్ర మంత్రివర్గం 2018, నవంబరు 22న ఆమోదం తెలిపింది.

★ 16వ శతాబ్దంలో రావి నది ఒడ్డున నిర్మితమైన కర్తార్‌పూర్‌లోని దర్బార్ సాహిబ్ గురుద్వారా సిక్కులకు చాలా పవిత్రమైంది. సిక్కు మత స్థాపకుడు గురునానక్ ఇక్కడే తన జీవితంలోని చివరి 18 ఏళ్లు గడిపారు. దేశ విభజన తర్వాత కర్తార్‌పూర్ సాహిబ్ గురుద్వారా పాకిస్థాన్‌కు వెళ్లింది. భారత్‌లో ఉన్న పంజాబ్‌లోని గురుదాస్‌పూర్ జిల్లా డేరాబాబానానక్ నుంచి కర్తార్‌పూర్ నాలుగు కి.మీ. దూరంలో ఉంది. డేరాబాబానానక్ నుంచి అంతర్జాతీయ సరిహద్దు వరకు కారిడార్ నిర్మాణాన్ని భారత్ చేపట్ట నుంది. తమ భూభాగంలో ప్రాజెక్టును పాకిస్థాన్ పూర్తి చేయనుంది.

★ 2018, నవంబరు 28న కర్తార్‌పూర్ నడవా నిర్మాణానికి పాకిస్థాన్ ప్రధాన మంత్రి ఇమ్రాన్‌ఖాన్ అక్కడి పంజాబ్ ప్రావిన్స్‌లో శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమానికి భారత ప్రభుత్వం తరపున కేంద్ర మంత్రులు హర్‌సిమ్రత్ కౌర్ బాదల్, హర్‌దీప్‌సింగ్ పురీ, పంజాబ్ మంత్రి నవజ్యోత్ సింగ్ సిద్ధూ హాజరయ్యారు.

## 14వ హాకీ ప్రపంచకప్ ప్రారంభం

14వ హాకీ ప్రపంచకప్ ఆరంభోత్సవం 2018, నవంబరు 7న భువనేశ్వర్‌లోని కళింగ స్టేడియంలో అంగరంగ వైభవంగా జరిగింది. టోర్నీలో పోటీపడుతున్న 16 జట్ల సారథుల సమక్షంలో ఒడిశా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ టోర్నీ ఆరంభమవుతున్నట్లు ప్రకటించారు. నవంబరు 28న జరిగిన టోర్నీ ప్రారంభ మ్యాచ్‌లో ఆతిథ్య భారత్ 5-0 గోల్స్ తేడాతో దక్షిణాఫ్రికాపై ఘన విజయం సాధించింది.

## ప్రపంచ చెస్ ఛాంపియన్

★ ప్రపంచ చెస్ ఛాంపియన్ - 2018గా నార్వే సూపర్ గ్రాండ్ మాస్టర్ మాగ్నస్ కార్ల్‌సన్ నిలిచాడు. 2018, నవంబరు 28న ఫాబియానో కరువానా (అమెరికా)తో లండన్‌లో ముగిసిన ప్రపంచ చెస్ ఛాంపియన్ షిప్‌లో కార్ల్‌సన్ 9-6 తేడాతో గెలుపొందాడు. కార్ల్‌సన్ ప్రపంచ విజేతగా నిలవడం వరుసగా ఇది నాలుగోసారి.

## అంగారకుడిపై 'ఇన్‌సైట్'

★ అంగారక గ్రహం అంతర్భాగాన్ని అధ్యయనం చేయడానికి అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ నాసా తొలిసారిగా ప్రయోగించిన రోబో ఆధారిత ల్యాండర్ 'ఇన్‌సైట్' 2018, నవంబరు 27న విజయవంతంగా ఆ గ్రహంపై దిగింది.

★ కాలిఫోర్నియాలోని వాండెన్‌బర్గ్ ఎయిర్‌ఫోర్స్ బేస్ నుంచి 2018, మే 5న దీన్ని ప్రయోగించారు. తాజాగా అంగారకుడి మధ్యరేఖ ప్రాంతానికి సమీపంలోని చదునైన 'ఎల్సియం ప్లానిషియా'లో ఇది దిగింది. అంగారకుడిపై ఇన్‌సైట్ ల్యాండింగ్ ప్రక్రియ కేవలం ఆరున్నర నిమిషాల్లోనే ముగిసింది. ఇన్‌సైట్ గంటకు 19,800 కి.మీ వేగంతో ప్రయాణించి అంగారకుడిని చేరింది. 365 కిలోల 'ఇన్‌సైట్' ల్యాండర్ 2020, నవంబరు 24 వరకు సేవలు అందిస్తుంది.

## హోంవర్క్ వద్దు

★ ఒకటి, రెండు తరగతుల విద్యార్థులకు ఎలాంటి హోంవర్క్ ఇవ్వకూడదని కేంద్రం స్పష్టం చేసింది. ఈ మేరకు పాఠశాల బ్యాగుల బరువు, బోధనాంశాల నియంత్రణకు సంబంధించిన మార్గదర్శకాలను రూపొందించాలని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు కేంద్ర మానవ వనరుల మంత్రిత్వ శాఖ 2018, నవంబరు 26న ఆదేశాలు జారీచేసింది.

★ బోధనాంశాలకు సంబంధించిన ఒకటి, రెండు తరగతుల విద్యార్థులకు భాషలు, గణితం తప్ప మరే ఇతర సబ్జెక్టులు బోధించకూడదని హెచ్‌ఆర్‌డీ మంత్రిత్వ శాఖ తెలిపింది. 3 నుంచి 5వ తరగతి విద్యార్థులకు భాషలు, గణితం, పర్యావరణశాస్త్రం తప్ప మరే సబ్జెక్టులను బోధించరాదని స్పష్టం చేసింది.

★ విద్యార్థుల పాఠశాల బ్యాగు బరువుకు సంబంధించి కూడా హెచ్‌ఆర్‌డీ మంత్రిత్వ శాఖ స్పష్టమైన ఆదేశాలు జారీచేసింది. దీని ప్రకారం ఒకటి, రెండు తరగతుల విద్యార్థుల పాఠశాల బ్యాగు బరువు 1.5 కిలోలకు మించకూడదు. 3 నుంచి 5 తరగతుల విద్యార్థుల స్కూలు బ్యాగు బరువు 2 నుంచి 3 కిలోలు మించకూడదు.

**ఈ వారం విశేషాలు**

★ ఐటీ రంగానికి అందించిన సేవలతోపాటు స్వచ్ఛంద సేవ, విశ్వవిద్యాలయం ద్వారా సమాజానికి అందిస్తున్న సేవలకు గుర్తుగా ఐటీ దిగ్గజం విప్రో అధినేత అజీమ్ ప్రేమ్‌జీకి అత్యున్నత ఫ్రెంచ్ పౌర పురస్కారం 'చెవాలియర్ డెలా లెజియన్ డి హానర్' (నైట్ ఆఫ్ ది లెజియన్ ఆఫ్ హానర్)ను ప్రకటించారు.

★ 2018, నవంబరు 26న గుంటూరు జిల్లా నకరికల్లు వద్ద రూ. 6,020 కోట్లతో చేపడుతున్న గోదావరి-పెన్నా నదుల అనుసంధానం తొలిదశ పనులకు సంబంధించిన పైలాన్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆవిష్కరించి పనులకు శ్రీకారం చుట్టారు.

★ ప్రధాని నరేంద్ర మోదీ ప్రతి నెలా చివరి ఆదివారం దేశ ప్రజలను ఉద్దేశించి ఆకాశవాణి ద్వారా చేసే 'మన్‌కీబాత్' ప్రసంగం 50వ ధారావాహికను 2018, నవంబరు 25న పూర్తిచేసుకుంది. 2014, అక్టోబరు 3న ప్రధాని మోదీ తొలిసారిగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

★ మహిళల టీ20 ప్రపంచకప్ - 2018 విజేతగా ఆస్ట్రేలియా నిలిచింది. ఫైనల్లో ఇంగ్లండ్‌పై 8 వికెట్ల తేడాతో నెగ్గింది. ఆస్ట్రేలియా టీ20 ప్రపంచకప్ గెలవడం ఇది నాలుగోసారి.

★ దిల్లీలో జరిగిన ప్రపంచ బాక్సింగ్ ఛాంపియన్ షిప్-2018లో భారత దిగ్గజం మేరీకోమ్ 48 కేజీల విభాగంలో స్వర్ణం నెగ్గింది. ఫైనల్లో హనా ఒఖోటా (ఉక్రెయిన్) ను 5-0 తేడాతో ఓడించింది. ప్రపంచ ఛాంపియన్ షిప్‌లో ఇది ఆరో స్వర్ణం. తద్వారా ప్రపంచ బాక్సింగ్‌లో అత్యధిక పతకాలు గెలిచిన మహిళా క్రీడాకారిణిగా చరిత్ర సృష్టించారు.

★ ఇటలీకి చెందిన ప్రఖ్యాత సినీ దర్శకుడు, ఆస్కార్ అవార్డు విజేత బెర్నార్డో బెర్టొలుచి (77) నవంబరు 26న రోమ్‌లో మరణించారు. ఈయన 1987లో రూపొందించిన 'ది లాస్ట్ ఎంపరర్' ఉత్తమ చిత్రం, ఉత్తమ దర్శకుడు సహా తొమ్మిది ఆస్కార్ అవార్డులను గెలుచుకుంది.

**రచయిత: సీహెచ్. కృష్ణప్రసాద్**